# సాక్షి నిర్మల్

సోమవారం, 15, జనవరి, 2024






**అయోధ్య అక్షింతలు.. రామయ్య ఆశీస్సులు**

ఉమ్మడి జిల్లాలో రామనామం మార్మోగుతోంది. అయోధ్య అక్షింతలు ఇంటింటికీ వస్తుండడంతో రామయ్య ఆశీస్సులు అందినట్లు భావిస్తున్నారు. 8లో▸



**'నాగోబా' ప్రచారయాత్ర షురూ**

పుష్యమాసం అమావాస్య పురస్కరించుకొని శనివారం రాత్రి నెలవంక చూసిన మెస్రం వంశీయులు ఆదివారం నాగోబా మహాపూజ ప్రచార రథాన్ని ప్రారంభించారు. 10లో▸

**వాతావరణం**

గరిష్టం/కనిష్టం 30.3 / 16.3

వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. చలి ప్రభావం తగ్గుతుంది. ఉదయం పొగమంచు కురిసే అవకాశం ఉంది.

# భోగిమంటలు.. సంక్రాంతి

- జిల్లా అంతటా పండుగ సంబురాలు
- ముంగిళ్లలో రంగుల హరివిల్లు
- ఇంటింటా పిండి వంటల ఘుమఘుమలు
- నింగిలో గాలిపటాల రెపరెపలు



నృత్యం చేస్తున్న చిన్నారి

భాగ్యనగర్ హనుమాన్ ఆలయంలో భోగి పండుగ సంబరాలు

నృత్యం చేస్తున్న యువతి

**నిర్మల్‌ఖిల్లా:** జిల్లాలో మంచు ముసుగేసుకున్న పల్లెలు, పట్నం గాలిపటాలతో పిల్లలు సందడి చేస్తే నోరూరించే కమ్మని రుచులతో పిండి వంటలు, ప్రతి లోగిళి ముందు సప్తవర్ణ రంగవల్లులు గొబ్బెమ్మలతో ఆడి పాడే ఆడపడుచులు, పంట చేతికి వచ్చి ఆనందించే అన్నదాతలు.. ఇలా ప్రకృతితో మమేకమయ్యే సంక్రాంతి మూడు రోజుల పండుగలో తొలి రోజు భోగిమంటలతో మొదలైంది. ఇలా ప్రతీ ఇంటి ముందు నూతన శోభతో కొత్తకాంతి విరజిమ్ముతోంది..

## భోగి అంతరార్థం-ఆరోగ్య భాగ్యం...

భోగభాగ్యాల ఆరోగ్యాన్ని అందించాలని జిల్లా వాసులు పండగ పూట భోగి పండ్లను చిన్నారుల తలపై పోసే సంప్రదాయాన్ని ఆచరించారు. సూర్య దేవుడికి ప్రీతిపాత్రమైన రేగుపళ్లను భోగి పండ్లుగా కీర్తిస్తూ చెరుకు ముక్కలు, నవధాన్యాలు, నాణేల కలబోతతో పిల్లలపై పోసే సంప్రదాయాన్ని కొనసాగించారు. ఇలా చేయడం వల్ల అనారోగ్య పరిస్థితులు ఉత్పన్నం కావని విశ్వాసం. ఇక భోగి రోజున తెల్లవారుజామునే ఇళ్లలోని పాత వస్తువులన్నీ ఇంటి ముంగిలిలో పేర్చి మంటను అంటించారు. దీని అంతరార్థం వ్యక్తిలో ఉన్న చెడువ్యసనాలన్నీ ఈ మంటల్లో కాలిబూడిదవ్వాలని.



చిన్నారులపై భోగిపండ్లు పోస్తున్న మహిళలు

## సంక్రాంతి గొబ్బెమ్మల ప్రత్యేకత...

సంక్రాంతి రోజున వివిధ రంగుల్లో వేసిన రంగవల్లుల మధ్యన గోమయంతో చేసిన గొబ్బెమ్మలను ఉంచుతారు. వీటిని గోమాతగా, కాత్యాయనీ దేవిగా, గోదాదేవిగా, లక్ష్మీదేవిగా ఆరాధించే సంప్రదాయం ఎప్పటినుంచో వస్తోంది. రంగవల్లుల సంస్కృతి సంక్రాంతి పర్వదినాల్లో ఎక్కువగా కనిపిస్తోంది. ముగ్గు మధ్యలో ఏర్పాటు చేసిన పెద్ద గొబ్బెమ్మను కృష్ణుడిగా, చుట్టూ గోపికలుగా మహిళలు పేర్కొంటారు. వీటి చుట్టూ యువతులు చేరి పాటలు పాడుతూ సంప్రదాయబద్ధంగా నృత్యం చేస్తారు. గొబ్బెమ్మలపై గుమ్మడి, చామంతి, బంతిపూలతో అలంకరించి పేరంటంగా ముస్తాబు చేస్తారు. ధనుర్మాసంలో వచ్చే ఈ గొబ్బెమ్మల సంస్కృతి అనాది నుంచి ఆచారంగా వస్తోంది.

## రివ్వున ఎగిరిన గాలిపటాలు...

జిల్లా కేంద్రంతో పాటు ఆయా మండలాల్లోని గ్రామాల్లో సైతం భోగి వేడుకను ఘనంగా జరుపుకున్నారు. పిండివంటలు ఆరగిస్తూ.. చిన్నారులు కేరింతలు కొడుతూ గాలిపటాలను రివ్వున ఎగురవేశారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో స్థానిక ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, భైంసాలో ఎమ్మెల్యే రామారావు పటేల్ చిన్నారులతో కలిసి పతంగి (గాలిపటం) ఎగురవేసి సందడి చేశారు.



పతంగులను ఎగురవేస్తున్న మహేశ్వర్ రెడ్డి

## ఆధ్యాత్మికతకు వారసులు... హరిదాసులు

తెల్లవారుజామునే శిరస్సుపై అక్షయపాత్ర ధరించి తంబుర మీటుతూ..వీధుల్లో నారాయణుడి నామస్మరణతో హరిదాసులు సంచరిస్తారు. నుదుట నామాలు ధరించి శ్రీ వైష్ణవ సంప్రదాయాన్ని వస్త్రధారణలో స్ఫూరింపజేస్తూ వీరి ఆహార్యం ఆధ్యాత్మికతను కలిగిస్తుంది. ప్రధానంగా సంక్రాంతి పర్వదినాల్లో ఇంటింటికీ తిరుగుతూ గృహిణులు ఇచ్చే సంభావనలు (బియ్యం, కూరగాయలు, ధనధాన్యాలు) స్వీకరిస్తారు. తలపై అక్షయపాత్ర ఉన్నంతవరకు మౌనవ్రతాన్ని ఆచరిస్తారు. రాగి, పంచలోహాలతో తయారయ్యే ఈ అక్షయపాత్రకు కూడా సంస్కృతి సారూప్యత కలిగి ఉంది. ఇది మహాభారతంలో సూర్యుని అనుగ్రహంతో లభించిందని, తరిగిపోని ఆహార పదార్థాలు సమకూర్చగలదని విశ్వాసం. సంక్రాంతిరోజు హరిదాసులను ఒక్కసారి చూసినా పుణ్యం లభిస్తుందని నమ్మకం.

## రంగుల ముగ్గులతో..



సంక్రాంతి అంటేనే సందడిగా ఉంటుంది. పొద్దున్నే మా పాప, నేను కలిసి ఇంటిముందు వాకిట్లో రంగులతో ముగ్గులు వేయడమంటే చాలా ఇష్టం. ప్రతీ ఏడాది కొత్తకొత్త ముగ్గులు వేస్తుంటాం. ఈసారి కూడా సంక్రాంతికి రంగుల ముగ్గులతో స్వాగతం పలుకుతాం.

– శైలజ, నిర్మల్

## సంక్రాంతి నోములు..



సంక్రాంతి రోజు పొద్దున్నే ఇంటి ముందు రంగురంగుల ముగ్గులు వేసుకుంటాం. పూజలు చేసి, నోములు నోచుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఒకరికొకరం నోములు అందించుకుంటూ పండుగ శుభాకాంక్షలు చెప్పుకుంటాం.

– సుప్రజ, నిర్మల్



సంక్రాంతికి నోములను సిద్ధం చేస్తూ..



చిన్నారిపై భోగిపండ్లు పోస్తున్న మహిళలు



బోయివాడలో భోగిమంటలు వేస్తున్న మహిళలు



బోయివాడలో ముగ్గులు వేస్తున్న మహిళలు



హనుమాన్ ఆలయంలో గంగిరెద్దుల ఆటలు



చిన్నారిపై భోగిపండ్లు పోస్తున్న మహిళలు

## న్యూస్‌రీల్

### నేడు జ్యోతి దర్శనం



మాట్లాడుతున్న గురుస్వామి సాయినాథ్

**భైంసా:** భైంసాలోని అన్నపూర్ణక్షేత్రంలో గల అయ్యప్పస్వామి ఆలయంలో జ్యోతి దర్శనం ఉంటుందని ఆలయ గురుస్వామి మంత్రి సాయినాథ్ తెలిపారు. కేరళలోని శబరిమలై వెళ్లలేనివారంతా భైంసాలోని అయ్యప్ప ఆలయానికి రావాలని సూచించారు. 41 రోజుల మండల దీక్ష పూర్తి చేసిన అయ్యప్పస్వాములంతా మకరజ్యోతి దర్శనానికి రావాలని సూచించారు. సాయంత్రం పడి పూజ కార్యక్రమం నిర్వహించిన అనంతరం అయ్యప్పస్వామికి నెయ్యాభిషేకం చేసి పూజలు చేపడుతామన్నారు.

### కొనసాగుతున్న క్రికెట్ పోటీలు



పోటీలు ప్రారంభిస్తున్న పోలీసులు

**భైంసారూరల్:** మండలంలోని తిమ్మాపూర్‌లో క్రికెట్ పోటీలు కొనసాగుతున్నాయి. ఆదివారం భైంసా ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్ క్రీడాకారులతో కలిసి కాసేపు క్రికెట్ ఆడారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇలాంటి పోటీలు యువకులకు క్రీడలపై ఆసక్తి పెంచుతాయన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఏఎస్పీని శాలువాతో సత్కరించారు. భైంసారూరల్ సీఐ నైలు, భైంసారూరల్, కుభీర్, కుంటాల ఎస్సైలు శ్రీకాంత్, షరీఫ్, హన్మండ్లు, తదితరులు పాల్గొన్నారు.

## కమణీయం.. గోదారంగనాథుల కల్యాణం



కల్యాణోత్సవానికి హాజరైన భక్తజనం



కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు

**భైంసాటౌన్:** పట్టణంలోని పద్మావతి కాలనీలో గల శ్రీ లక్ష్మీవేంకటేశ్వర ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం ఆలయంలో గోదారంగనాథుల కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య గోదారంగనాథుల కల్యాణోత్సవం కన్నుల పండువగా జరిగింది. అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు, మహిళలు కళ్యాణోత్సవం తిలకించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. పట్టణంలోని పురాణ బజార్‌లో మార్వాడీ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు ఎమ్మెల్యే రామారావు పటేల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన పల్లకిసేవలో ఎమ్మెల్యే పాల్గొన్నారు.

## 'కడెం' వద్ద పర్యాటకుల సందడి



బోటింగ్ చేస్తున్న పర్యాటకులు

**కడెం:** కడెం ప్రాజెక్ట్ పరిసరాలు ఆదివారం పర్యాటకులతో సందడిగా మారాయి. ఎస్పీ జానకీ షర్మిల కుటుంబ సభ్యులతో కలిసి ప్రాజెక్ట్ అందాలను తిలకించి బోటింగ్ చేశారు. ఎస్పీ వెంట ఖానాపూర్ సీఐ మోహన్, పెంబి ఎస్సై రజనీకాంత్, ఏఎస్సై దేవు, సిబ్బంది ఉన్నారు.



ప్రాజెక్ట్ వద్ద ఎస్పీ జానకీ షర్మిల

## పుస్తకావిష్కరణ



పుస్తకం ఆవిష్కరిస్తున్న నాయకులు

**భైంసాటౌన్:** పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం వీహెచ్‌పీ ఆధ్వర్యంలో రామ జన్మ భూమి అయోధ్య ఉద్యమ చరిత్రను తెలిపే 'జాగృతి ప్రత్యేక సంచిక' పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేశ్ గుజ్జల్ వార్, మహిషా పట్టణ అధ్యక్షుడు డా.మహిపాల్, జిల్లా సహ సంఘచాలక్ సాదుల కష్టదాస్, విశ్వహిందూ పరిషత్ నగర కార్యదర్శి పెరుగు నవీన్, నారాయణ, రాజు, లంక గంగాధర్, రాందాస్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు ముగ్గుల పోటీలు

**కుంటాల:** సంక్రాంతిని పురస్కరించుకుని స్థానిక ప్రాచీన శ్రీకృష్ణ దేవాలయంలో సోమవారం ఉదయం 9 గంటలకు మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఎల్లమ్మల శంకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహిళలు, విద్యార్థినులు పోటీల్లో పాల్గొనాలని ఆయన కోరారు.

## నాట్లేస్తాం.. వరి నాట్లేస్తాం..



చామన్‌పెల్లి సమీపంలో వరి నాటు వేస్తున్న కూలీలు

- వ్యవసాయ పనుల్లో కోల్‌కత్తా, బిహార్ కూలీలు
- ఎకరాకు రూ.4,500 చొప్పున వసూలు
- సంతృప్తి వ్యక్తం చేస్తున్న రైతులు



మునిపెల్లి వద్ద వరి నారు తీస్తున్న కూలీలు

**లక్ష్మణచాంద:** జిల్లాలో వ్యవసాయ మండలంగా పేరున్న లక్ష్మణచాందలో ఈ ఏడాది యాసంగి సీజన్ వరినాట్లు జోరందుకున్నాయి. కూలీలు దొరకకపోవడంతో రైతులు బిహార్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల నుంచి కూలీలను తీసుకువచ్చి నాట్లు వేయిస్తున్నారు. ఆయా రాష్ట్రాల్లో రెండో పంట సమయంలో ఉపాధి లభించకపోవడంతో కూలీలు తెలంగాణకు వలస వస్తున్నారు. ఇక్కడ నాట్లు వేస్తూ ఉపాధి పొందుతున్నారు.

**అన్నిపనులూ వారే..**

బిహార్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల నుంచి వచ్చిన కూలీలు వరి నారు తీయడం, తీసిన నారును మడులలో పంచుకోవడం, మందు చల్లడం, నాటు వేయడం.. ఇలా అన్నిపనులూ వారే చేస్తున్నారు. ఉదయం 7 గంటలకే పొలం వద్దకు చేరుకున్న కూలీలు ముందుగా వరినారు తీస్తున్నారు. ఆతర్వాత ఎరువులు చల్లిన అనంతరం నాటు వేయడం ప్రారంభిస్తున్నారు. 12 మంది కలిసి ఒక గ్రూపుగా ఏర్పడుతున్నారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు రోజుకు మూడు నుంచి నాలుగు ఎకరాల్లో వరి నాటు వేస్తున్నారు.

**ఎకరాకు రూ.4 వేల నుంచి రూ.4,500**

మండలంలోని మునిపెల్లి, చామన్‌పెల్లి, లక్ష్మణచాంద, తదితర గ్రామాల్లో 12 మంది కలిసి గ్రూపుగా ఏర్పడిన కూలీలు ఎకరాకు రూ.4 వేల నుంచి రూ.4,500ల చొప్పున తీసుకుని నాట్లు వేస్తున్నారు. ఒక్కో గ్రూపుకు రోజుకు రూ.16 వేల చొప్పున, ఒక్కో కూలీకి రోజుకు రూ.900 నుంచి రూ.వెయ్యి వరకు సంపాదిస్తున్నారు.

### రోజుకు నాలుగెకరాల్లో..



12 మంది సభ్యులం కలిసి గ్రూపుగా ఏర్పడ్డాం. రోజుకు మూడు నుంచి నాలుగు ఎకరాల్లో వరినాట్లు వేస్తున్నాం. దీంతో రోజుకు కూలి రూ.900 నుంచి వెయ్యి వరకు సంపాదిస్తున్నాం.

– సికిందర్, కూలీ, బిహార్

### ఉపాధి పొందుతున్నాం



మాది పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోని కోల్‌కత్తా. మా ఊళ్లో ఈ సమయంలో సరైన కూలీ పనులు దొరకకపోవడంతో ఇక్కడికి వలస వచ్చాం. ఇక్కడ నాట్లు వేస్తూ ఉపాధి పొందుతున్నాం.

– వివేక్, కూలీ, కోల్‌కత్తా

### ఉదయమే వస్తున్నాం



కోల్‌కత్తా నుంచి ఇక్కడికి పనికోసం వచ్చాం. లక్ష్మణచాంద మండలంలోని మునిపెల్లిలో వరినాట్లు వేస్తున్నాం. రోజు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నాటు వేస్తున్నాం. – బొరుగోల్‌దార్, కూలీ, కోల్‌కత్తా

## దాడిచేసింది పులికాదు

**భైంసా:** మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో శనివారం పులిదాడిలో జింక మృతి చెందిందని చెప్పడంతో అటవీ అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. శివారు ప్రాంతంలో జింక కళేబరాన్ని స్వాధీనం చేసుకుని పరీక్షలు జరిపించారు. జింకపై పులిదాడి చేయలేదని నక్క దాడిలో మృతిచెందిందని అధికారి రమేశ్ వెల్లడించారు. పరిసర ప్రాంతాల్లో సీసీ పుటేజీల్లో నక్క కనిపించిందని పేర్కొన్నారు.

## తప్పిన ప్రమాదం!

**కుంటాల:** మండలంలోని అంబకంటి గ్రామానికి బొల్లెపల్లి నాగరాజు ఇటీవల ఎలక్ట్రికల్ బైక్ కొనుగోలు చేశాడు. ఆదివారం సాయంత్రం పార్కింగ్ చేసి ఉన్న ఎలక్ట్రికల్ బైక్‌ను చార్జింగ్ చేసే క్రమంలో బ్యాటరీ నుంచి పొగలు వచ్చాయి. గమనించిన నాగరాజు బ్యాటరీని పక్కకు పడేశాడు. స్థానికులు వచ్చి మంటలార్పివేశారు. దీంతో ప్రమాదం తప్పింది.



కాలుతున్న బైక్ బ్యాటరీ

## గంగాధర్‌కు సన్మానం



సన్మానిస్తున్న కౌన్సిలర్ భరత్

ఆదిలాబాద్‌టౌన్: నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియామకమైన కొండూరి గంగాధర్‌ను ఆదివారం సరస్వతినగర్ పంచముఖ హనుమాన్ రామాంజనేయ కమిటీ సభ్యులు, కాలనీవాసులు సన్మానించారు. నాల్గో తరగతి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. నిర్మల్ మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు, ఆలయ కమిటీ సభ్యులు గంగన్న, శ్రీనివాస్, రాజన్న, దేవిదాస్, అశోక్, కౌన్సిలర్ భరత్ తదితరులు పాల్గొన్నారు.

## చెప్పుల గోదాం దగ్ధం

లోకేశ్వరం: మండల కేంద్రంలో ఆదివారం విద్యుత్‌షాక్‌తో చెప్పుల గోదాం దగ్ధమైంది. మధ్యాహ్నం గోదాం నుంచి పొగరావడాన్ని స్థానికులు గమనించారు. షెటర్ తాళాన్ని పగులగొట్టి నీటితో మంటలార్పివేశారు. అప్పటికే చెప్పులు, ఇతర సామగ్రి కాలిపోయాయి. వీటి విలువ రూ.2 లక్షలు ఉంటుందని బాధితుడు విఠల్ తెలిపాడు.










# అయోధ్య అక్షింతలు.. రామయ్య ఆశీస్సులు



మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా శ్రీరామనామ జపం చేస్తోంది. అయోధ్య రాముడి పూజిత అక్షింతలు ఇంటింటికీ పంపిణీ జరుగుతున్నాయి. జైశ్రీరాం.. రామలక్ష్మణ జానకీ.. అంటూ ఊరూవాడా, పల్లె, పట్నం అంతా కూడా కాషాయమయం అవుతుండగా శ్రీరామ పూజిత అక్షింతలతో శోభాయాత్రగా మేళతాళాలు, కోలాటాలు, చెక్కభజనలు, శ్రీరామ, హనుమ భజనలతో సాగుతూ ఇంటికీ చేరుతున్న అక్షింతలను మంగళహారతులతో స్వీకరిస్తున్నారు. శ్రీరామ అక్షింతల పంపిణీలో ప్రతిఒక్కరూ తమ బాధ్యతగా అక్షింతల పంపిణీలో భాగస్వామ్యం అవుతున్నారు.

- హారతులతో స్వాగతం పలుకుతూ స్వీకరిస్తున్న భక్తులు
- 15వ తేదీ వరకు ఇంటింటా పంపిణీ పూర్తికి సన్నాహాలు
- అక్షింతలు, ఆలయ చిత్రపటం, విశేష కరపత్రం అందజేత
- శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో పంపిణీ

**తీర్థక్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో..**

అయోధ్యలో శ్రీరామ జన్మభూమి ఆలయ ప్రాణప్రతిష్ఠ 22వ తేదీన జరగనుంది. అయితే కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అయోధ్యలో బాలరాముడి వద్ద పూజించిన అక్షింతల వితరణ శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపట్టారు. మంచిర్యాల జిల్లాలో ఈ నెల 1వ తేదీన ఆరంభం కాగా 15వ తేదీ వరకు అక్షింతల పంపిణీ పూర్తి చేసేలా కార్యక్రమం సాగుతోంది. జిల్లాకు మొత్తంగా 35 క్వింటాళ్ల అక్షింతలు వచ్చాయి.

**అక్షింతల వితరణ ఇలా..**

సంచాలన సమితీ సభ్యులు ప్రతీరోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు బృందంగా ఏర్పడి పంపిణీ చేస్తోంది. కలశ ప్రముఖ్ అక్షింతల కలశాన్ని శిరస్సుపై పెట్టుకుని బృందంతో కలిసి ఇంటింటికీ వెళ్తున్నారు. పలువురు మంగళహారతితో స్వాగతం పలుకుతూ అక్షింతలు స్వీకరిస్తున్నారు. అక్షింతలు, శ్రీరామజన్మభూమి మందిర చిత్రపటం, ఆలయ విశేషాలు తెలిపే కరపత్రం అందజేస్తున్నారు. మంచిర్యాల జిల్లాకు వచ్చిన దాదాపు 13 క్వింటాళ్ల అక్షింతల్లో కుమురంభీం జిల్లాకు కూడా పంపించారు. మంచిర్యాల జిల్లాలో సుమారు 3 లక్షల కుటుంబాలకు అక్షింతలు పంపిణీ చేయాలని సంకల్పించిన నేపథ్యంలో ఇప్పటి వరకు దాదాపు 1.80 లక్షల కుటుంబాలకు అక్షింతలు వితరణ చేసినట్లు శ్రీరామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ సమయోజక్‌లు తెలియజేశారు.



నిర్మల్‌లో అక్షింతలు పంపిణీ చేస్తున్న వీహెచ్‌పీ నేతలు



అక్షింతలకు ఆహ్వానం పలుకుతున్న నిర్మల్‌వాసులు

**ప్రాణప్రతిష్ఠ రోజున తలపై..**

అయోధ్య శ్రీరామ పూజిత అక్షింతలు శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇంటింటా పంపిణీ జరుగుతున్నాయి. శ్రీరాముడి పూజిత అక్షింతలు ఈ నెల 22వ తేదీ శ్రీరామజన్మభూమి ఆలయంలో విగ్రహ ప్రాణప్రతిష్ఠ రోజున ఇంటిల్లిపాది ఆ పూజిత అక్షింతలను తలపై వేసుకుని శ్రీరాముడి ఆశీర్వాదం పొందుతూ శ్రీరామ విగ్రహ ప్రాణప్రతిష్ఠలో కూడా భాగస్వామ్యం అయినట్లుగా భావించాలని శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ తెలియజేస్తుంది.

**భారీ శోభాయాత్ర**

జీవితంలో మళ్లీ చూడబోని శ్రీరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ రోజున మంచిర్యాల జిల్లా కేంద్రంలో భారీ శోభాయాత్ర తలపెట్టారు. మంచిర్యాల ఐబీ చౌరస్తాలోని హనుమాన్ విగ్రహం నుంచి ఆరంభమయ్యే శోభాయాత్ర వెంకటేశ్వర టాకీస్ మీదుగా గంగారెడ్డి రోడ్, విశ్వనాథాలయం, రైల్వేస్టేషన్ రోడ్, మార్కెట్ రోడ్‌ల మీదుగా జిల్లా పరిషత్ బాలుర పాఠశాల మైదానం వరకు సాగనుంది. ఇక్కడ పాల్గొనే భక్తజనులందరికీ శ్రీరామ విగ్రహ ప్రతిష్ఠాపన ప్రసాద పంపిణీ వితరణ చేయనున్నారు.

### అక్షింతల రూపంలో శ్రీరాముడు...

నిర్మల్: జిల్లాలోనూ అయోధ్యలో పూజించిన అక్షింతల పంపిణీ ఇంటింటా సాగుతోంది. ప్రతి పల్లెకూ.. ప్రతి ఇల్లుకూ చేరుతున్నాయి. రామ జన్మభూమి నుంచి పంపిన అక్షింతలను ఆహ్వానిస్తూ.. రాములోరే ఈ రూపంలో తమ ఇంటికి వచ్చినట్లుగా జిల్లావాసులు భావిస్తున్నారు. అయోధ్య నుంచి నేరుగా నిర్మల్ వచ్చిన అక్షింతలను స్థానిక బాగులవాడ సరస్వతి శిశుమందిర్ పక్కన గల రామాలయంలో ఉంచి, అక్కడి నుంచి జిల్లా మొత్తం పంపిస్తున్నారు. జిల్లాలోని విశ్వ హిందూపరిషత్(వీహెచ్‌పీ), బజరంగ్‌దళ్, హిందూవాహిని, స్థానిక యువజన, కాలనీ సంఘాలు, ఇతర ఆధ్యాత్మిక సంస్థలూ అయోధ్య అక్షింతల పంపిణీలో భాగమవుతున్నాయి.



నిర్మల్‌లో కాలనీవాసులే ఇంటింటికీ అందిస్తూ..

### ఇలాంటి అవకాశం జన్మలో రాదు



అయోధ్య శ్రీరామ పూజిత అక్షింతలు పట్టుకుని ఇంటింటికీ తిరుగుతూ పంచే అవకాశం జన్మలో రాదు. ఇది నిజంగా పూర్వజన్మ సుకృతమే. అక్షింతలు, రామమందిర ఫోటోలు, కరపత్రాలను ఇంటింటా అందిస్తూ ఉండగా ప్రతిఒక్కరూ పండుగ వాతావరణంలో మంగళహారతులతో స్వాగతిస్తూ తమకు నీళ్లారబోస్తూ అక్షింతలు స్వీకరిస్తూ ఉంటే శ్రీరాముడే ఈ అదృష్టం తమకు కలిగించినట్లు భావిస్తున్నాం.

– మన్నవ శివపావని, సంచాలన సమితీ సభ్యురాలు

### 27 గ్రామాల్లో పంపిణీ చేశాం



ఆసిఫాబాద్: ఆసిఫాబాద్ మండలంలోని 27 గ్రామ పంచాయతీల్లో అయోధ్య బాలరాముడి అక్షంతలు పంపిణీ చేశాం. ఈ నెల 16 వరకు అక్షంతల పంపిణీ కొనసాగనుంది. అక్షంతలను పూజా గదిలో, తినే బియ్యంతో పాటు బీరువాలో భద్రపరుచుకోవాలి. వివాహాలు, శుభకార్యాలతో పాటు కొత్త పనులు ప్రారంభించే సమయంలో ఈ అక్షంతలు వినియోగించుకోవాలని పండితులు సూచిస్తున్నారు.జ

– ఇరుకుల్ల అంజనేయులు, రామజన్మభూమి తీర్థ ట్రస్ట్, మండల అధ్యక్షుడు

### గడప గడపకూ అక్షింతలు



ఆదిలాబాద్‌టౌన్: అయోధ్య శ్రీ రామజన్మ భూమి అక్షింతలను గ్రామాల్లో గడప గడపకూ వెళ్లి పంపిణీ చేయడం జరిగింది. జిల్లా అధికారులు, మందిరాలకు వెళ్లి అక్షింతలను అందించాం. కాలనీల్లో మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈనెల 1 నుంచి 15 వరకు అక్షింతల పంపిణీ కార్యక్రమం చేపట్టగా, 16 నుంచి 21వ తేది వరకు ఆలయ శుద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తాం. ఈ కార్యక్రమాల్లో దుర్గావాహిని, విశ్వహిందూ పరిషత్, హిందూవాహిని, బజరంగ్ దళ్ తదితర హిందూ ఉత్సవ సంఘాలు పాలుపంచుకున్నారు.

– రేఖ రజిని, దుర్గావాహిని ప్రముఖ్, ఆదిలాబాద్

### మహద్భాగ్యం



జైశ్రీరాం.. దేశమంతా ఎదురుచూస్తున్న అయోధ్య రామాలయ ప్రారంభోత్సవం సందర్భంగా అక్కడి నుంచి వచ్చిన పూజిత అక్షింతలను అందుకోవడం మహద్భాగ్యం. వీటిని ఇంటింటికే చేర్చే అదృష్టం దక్కడం చాలా ఆనందాన్నిస్తోంది.

–ముప్పిడి రవి, వీహెచ్‌పీ పట్టణాధ్యక్షుడు, నిర్మల్

### రామయ్య వచ్చినట్లే



అయోధ్యలో రామాలయ నిర్మాణానికి చేపట్టిన కరసేవకు వెళ్లే అదృష్టం దక్కింది. ఇప్పుడు అదే అయోధ్యలో పూజించిన అక్షింతలను పంపిణీ చేసే అదృష్టం రావడం సంతోషంగా ఉంది. స్వయంగా ఆ అయోధ్య రాముడే తమ ఇంటికి వచ్చాడన్నట్లుగా అక్షింతలను కళ్లకు అద్దుకుని ఇంట్లోకి తీసుకెళ్లి పూజిస్తున్నారు.

– మందిరాల నాగభూషణ్, శ్రీరామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ జిల్లా కన్వీనర్, నిర్మల్

## భోసిలో ఉద్యమ కమిటీ సభ్యుల పర్యటన

తానూరు: మండలంలోని భోసి గ్రామంలో ఆదివారం ప్రత్యేక తెలంగాణ ఉద్యమ రచయిత కమిటీ సభ్యులు పర్యటించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం భోసి గ్రామంలో అమరణ నిరాహార దీక్ష ప్రారంభించిన విషయం తెలిసిందే. దీక్షలో పాల్గొన్న వారి వివరాలను సేకరించేందుకు గ్రంథ రచయితలు జాదవ్ పుండలిక్ పాటిల్, సోమ జనార్దన్‌రెడ్డి, ముధోల్ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ రామకృష్ణగౌడ్ గ్రామంలో పర్యటించారు. గతంలో ఇక్కడ కొనసాగిన ఉద్యమ వివరాలను గ్రామస్తులతో అడిగి తెలుసుకున్నారు. త్వరలో నియోజకవర్గ ఉద్యమంపై ముధోల్ తెలంగాణ ఉద్యమ చరిత్ర పుస్తకాన్ని విడుదల చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శివకుమార్, తెలంగాణ ఉద్యమకారుడు రాఘవులు, ఉపాధ్యాయుడు నగేశ్ ఉన్నారు.




# పిండివంటలతో ఉపాధి

భైంసాటౌన్: ఇంటి వద్ద తయారు చేసే పిండి వంటలనే ఉపాధిగా మలచుకుని ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు భైంసాకు చెందిన పలువురు మహిళలు. సకినాలు, అప్పాలు, మురుకులు, కారంపూస వంటి పిండి వంటలను ఆర్డర్‌పై తయారు చేస్తూ ఉపాధి పొందుతున్నారు. తద్వారా కుటుంబపోషణలో తమ వారికి చేదోడువాదోడుగా నిలుస్తున్నారు. ప్రస్తుతం సంక్రాంతి పండుగ నేపథ్యంలో పిండి వంటల తయారీలో బిజీబిజీగా ఉంటున్నారు. రెండేళ్ల కిందట ఒకటితో ప్రారంభమైన పిండి వంటల తయారీ కేంద్రాలు ప్రస్తుతం పట్టణంలో పదుల సంఖ్యకు చేరుకున్నాయి.



పిండి వంటల తయారీలో నిమగ్నమైన మహిళలు

### ఉపాధి బాగుంది



పిండివంటలకు డిమాండ్ బాగుంది. ఆర్డర్‌పై సకినాలు, అప్పాలు, మురుకులు, కారంపూస వంటి పిండి వంటలు తయారు చేసిస్తాం. జొన్నరొట్టెలు, సర్వపిండి కూడా ఆర్డర్‌పై తయారు చేసిస్తాం. నెలకు రూ.8–9వేల వరకు ఆదాయం వస్తోంది.

– రుక్మవ్వ, రాజీవ్‌నగర్, భైంసా

### కుటుంబానికి చేదోడుగా



భర్త కిరాణ దుకాణంలో పనిచేస్తున్నారు. బీడీలు చుడితే నెలకు రూ.2–3వేలు మాత్రమే ఆదాయం వచ్చేది. పిండివంటల తయారు చేసివ్వడం ద్వారా రోజుకు రూ.250–300 వరకు సంపాదిస్తున్నాను. సంపాదనతో కుటుంబానికి చేదోడువాదోడుగా నిలుస్తున్నాను.

– లక్ష్మి, రాజీవ్‌నగర్, భైంసా

### నలుగురికి ఉపాధి కల్పిస్తున్నా



నిజామాబాద్, నిర్మల్ ప్రాంతాల్లోని మా బంధువులు, స్నేహితుల వద్దకు వెళ్లినప్పుడు వారు పిండి వంటలు చేసిస్తూ ఉపాధి పొందడం గమనించాను. దీంతో ఇంటి వద్ద ఖాళీగా ఉండలేక వారిని చూసి భైంసాలోనూ పిండివంటలు చేసివ్వడం ప్రారంభించాను. మొదట్లో అంతగా ఆదరణ లేకపోయినా.. క్రమంగా ఆర్డర్లు పెరుగుతున్నాయి. నాతోపాటు మరో నలుగురు ఉపాధి పొందుతున్నారు.

– లక్కంపల్లి శమంత, పిండివంటల తయారీకేంద్రం, భైంసా

# సందేశాన్నిచ్చిన సంక్రాంతి ముగ్గు

- సామాజిక మాధ్యమాలకు బానిసగా మారొద్దంటూ..
- చిత్రకారుడు అడ్డిగ శ్రావణ్ వేసిన రంగవల్లి
- పలువురిని ఆలోచింపజేస్తున్న సృజనాత్మక ముగ్గు

నిర్మల్‌ఖిల్లా: సంక్రాంతి అంటే రంగవల్లులకు పేరు. అయితే ఆ సంక్రాంతి ముగ్గులో విభిన్నతను ప్రదర్శించాలనుకున్నాడు నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన చిత్రకారుడు అడ్డిగ శ్రావణ్ కుమార్.. ప్రస్తుత కాలంలో విద్యార్థులు, యువత వయసు ప్రమేయం, చిన్న పెద్ద తారతమ్యం లేకుండా అందరూ సామాజిక మాధ్యమాలకు బానిసగా మారుతున్నారు. అధికసమయాన్ని వీటికే వెచ్చిస్తున్నారు. ఇదే అంశాన్ని స్థానిక మంజులాపూర్ కాలనీకి చెందిన శ్రావణ్‌కుమార్ తన ఇంటి ముందు స్వయంగా వేసిన ముగ్గులో సందేశం రూపంలో అందించాడు. రోడ్డుపై వచ్చిపోయే వారు సందర్శించేలా ''డోంట్ బి అడిక్టెడ్' అంటూ వేసిన ఈ ముగ్గు పలువురిని ఆకట్టుకుంటుంది. ఈ ముగ్గులో పలు సామాజిక మాధ్యమాలు ప్రతిబింబించేలా తీర్చిదిద్దాడు. ఫేస్‌బుక్, ఇంస్టాగామ్, వాట్సాప్, యూట్యూబ్, ట్విట్టర్, జిమెయిల్, గూగుల్ క్రోమ్ వంటి పలు ఇంటర్నెట్ సోషల్ మీడియాను మితిమీరి వినియోగిస్తూ వాటికే అడిక్ట్ అవుతున్న తీరును ఇలా సృజనాత్మకంగా ప్రదర్శించడం పలువురిని ఆలోచింపజేస్తోంది. చాలామంది విభిన్నరీతిలో ఇచ్చిన సందేశాన్ని ప్రశంసిస్తున్నారు.



సందేశాన్నిచ్చేలా తీర్చిదిద్దిన రంగవల్లి ఇదే